కన్నె మనసులో యెన్నో కలలుంటాయి. వాటిలో కొన్నయినా వాస్తవ జీవితానికి అందవు. అలాంటప్పుడు—కలలోకూడా అనుకోనివి నిజంగా జరిగితే—!

"సంధ్యా ఇవాళ కాలేజికెళ్ళొద్దమ్మా...." అన్నారు సంధ్య గదిలోకి వస్తూ పార్వతమ్మగారు.

"ఇవాళ మాకు ప్రాక్టికల్స్ వున్నాయమ్మా, వెళ్ళాలి" అంది రికార్డు బుక్‌లోంచి తలెత్తకుండానే సంధ్య.

"ఈవేళ ఇంట్లో వుండాలే నీవు. నిన్ను చూసేందుకు పెళ్ళివారొస్తున్నారు" అన్నారు పార్వతమ్మగారు ముసిముసిగా నవ్వుతూ కూతురికేసి ఆప్యాయతగా చూసుకుంటూ.

సంధ్య మొహంలో ఓ క్షణం విసుగు అస్పష్టంగా కదిలి క్రమంగా మామూలయింది. తలెత్తి తల్లికేసి చూస్తూ "ఏమిటమ్మా యిది.... పెళ్ళిచూపులు, పెళ్ళిచూపులు అంటూ నా ప్రాణం తీస్తార్రు. ఆ పద్ధతులు వద్దని ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోరేం? నా కిష్టంలేదు. సంతలో పశువులా.... ఛీఛీ" విసుక్కుంది సంధ్య.

"ఏమిటే నీ ఆగడం.... చదువుకుంటే వున్న మతి పోతోందని. పెళ్ళిచూపులు లేకుండా ఎవరు పెళ్ళి చేసుకుంటారే...." పార్వతమ్మగారు దవడలు నొక్కుకున్నారు.

"ఎవరూ చేసుకోకపోతేనేం? ఎంచక్కా చదువుకుని ఉద్యోగం చేసుకు బ్రతుకుతాను...." విసురుగా అనేసి తల మళ్ళీ రికార్డు బుక్‌లో దూర్చేసింది సంధ్య.

అవతల గదిలోంచి తల్లీ, కూతుళ్ళ సంభాషణంతా విన్న శంకరంగారు కల్పించుకుని- "ఈవేళ వెళ్ళకపోతే కొంపలు మునిగిపోవులే.... చెప్పినట్టు విను" అన్నారు అక్కణ్ణుంచే.

సంధ్య తలెత్తకుండా, జవాబు చెప్పకుండా మౌనంగా వుండిపోయింది. ఆమెకు తండ్రికి ఎదురు చెప్పగల సాహసం లేకపోయింది. ఎందుకో పార్వతమ్మగారి ముఖంలో ఓ రకమైన తృప్తి రేఖ మాత్రంగా తొంగి చూసింది. ఆవిడ నవ్వుకుంటూ వంటింటి వేపు నడిచారు.

శంకరంగారు డి. ఎం. ఓ.గా పనిచేసి రెండేళ్ళ క్రితం రిటైరయ్యారు. పెద్ద కూతుళ్ళిద్దరికీ ఆయన సర్వీసులో వుండగానే వైభవంగా పెళ్ళి చేశారు. కొడుకులిద్దరూ నార్తిండియాలో పెద్దపెద్ద హోదాల్లో వున్నారు. ఇక మిగిలింది సంధ్య. ఆ అమ్మాయి పెళ్ళికూడా చేసి నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చాలని ఆయన కోరిక. పెళ్ళికొడుక్కి పాతిక వేలదాకా కట్నమిచ్చి చేయగల స్తోమతు వుందాయనకు. సర్వీసులో వుండగా రెండు చేతులా సంపాదించాడని కిట్టని వారంటుంటారు.


పార్వతమ్మగారు మూడురకాల స్వీటు, రెండు రకాల హాటు, ఫ్రూట్ సాలిడ్ చేశారు పెళ్ళివారి కోసం. రిటైర్డు జడ్జి ముకుందరావుగారి సంబంధమంటే మాటలు కాదు మరి.

కొట్లో వస్తువును కొన్నట్టు పెళ్ళికొడుకును డబ్బుపెట్టి కొనడం సంధ్యకు సుతరామూ యిష్టంలేదు. వివాహ బంధమనేది ప్రేమానురాగాలతో నైతికంగా, మానసికంగా బంధింపబడి వుండాలని, ఇలా డబ్బు రూపేణా బంధింపబడ కూడదని సంధ్య అభిప్రాయం. సంధ్య కట్నం రూపంగా ఆడపిల్ల తల్లిదండ్రులను పీడించేవ్యక్తిని పెళ్ళాడకూడదనీ, తనను ఓ వ్యక్తిగా గుర్తించి, ప్రేమించేవాడిని చేపట్టాలనీ, ఆస్తి అంతసులకన్నా త్రికరణ శుద్ధిగా ప్రేమించే హృదయం గొప్పదని విశ్వసించే వ్యక్తి. తల్లిదండ్రులు చేస్తూన్న ఈ ప్రయత్నాలు తనకు నచ్చకపోయినా, విధిలేక గమ్మునుండి పోతోంది. కానీ, ఆమె అంతరంగంలో మథనం సాగుతూనే వుంటుంది.

సాయంకాలం నాలుగుగంటల ప్రాంతాన పెళ్ళికొడుకు రవి, అతని తలి, తండ్రి వచ్చారు.

రవి తండ్రి జిల్లా జడ్జిగా వుద్యోగం చేసి మంచివాడని పేరు తెచ్చుకున్నారు. ఆయనకు ఒక్కగానొక్క కుమారుడు. కొడుకును ఇంజనీరును చేసి, కొడుకును చూసుకుంటూ తృప్తిగా కాలం వెళ్ళదీస్తున్నారు. రవి ఇంజనీరుగా వుంటున్నా చాలా సింపిల్‌గా వుంటాడు- మంచి మనసున్న మనిషి.

శంకరంగారు, రవితండ్రి ముకుందరావు కా పేపు రాజకీయాలు, మరికా పేపు






ప్రపంచ పోకడలు. నేటి యువతీ యువకుల వైఖరులు- అవీయివీ అన్నీ మాట్లాడాక టిఫిన్లు పూర్తయ్యాయి. పార్వతమ్మగారు సంధ్యతో కాఫీ పంపించారు ట్రేలో. లేత గులాబి రంగు చీరలో- అదే రంగు బ్లౌజుతో, త్రాచుపాము లాంటి జడ అల్లనల్లన కదులుతోంటె. సన్నని నడుము అలవోకగా కదులుతోంటె. జడలో ఒకే ఒక గులాబి ఒక ప్రక్కగా పెట్టుకుని. గులాబి రెమ్మలా కదలివస్తోన్న సంధ్యను చూసి రవి మనసు తృప్తిపడింది. పెళ్ళిచూపు లనగానే అనవసరపు ఆడంబరాలతో, పట్టు చీరలో మోపెడు నగలతో, నిండు మేకప్‌తో లేనిపోని సిగ్గును ప్రదర్శించే ఆడపిల్లలకన్నా సంధ్య ఎన్నో రెట్లు అందంగా అవుపించింది. ఆమె నడకలో వయ్యారంతో బాటు గాంభీర్యం కూడా వుందనిపించింది రవికి. అందమైన ఆమె వదనంలో హుందాతనం గోచరించిందతనికి. సంధ్య నిరాడంబరతలో, నిండుతనంలో అతనికేదో పెన్నిధి లభించినటు ఫీలయ్యాడు. అతని కెందుకో తనకు నచ్చిన అమ్మాయి యీమే నన్న భావం కదలాడ సాగింది మనసులో.

## మల్లెపందిరి

### కోరికల నాగరికత

నిజం బండరాయిలా కంటిముందు కనపడుతూనే వుంది. అయినా మన ప్రవర్తన ఆ నిజాన్ని చూసిన లక్షణాన్ని ప్రతిబింబించటం లేదు.

సిల్హణుడనే కవి అంటున్నాడు:

త్వా ముదర సాధు మన్యే శాకైరపి యదసి లబ్ధపరితోషం
హతహృదయం హ్యధికాధికవాంఛాశతదుర్భరం న పునః॥

ఉదరమా నీవే మంచిదానవు. కలో, గంజో కాయగూరలో ఉంటే తృప్తి పడిపోతావు. ఈ దరిద్రగొట్టు మనస్సు వందలకొద్దీ కోరికలు కోరుతూ ఉంటుంది. దానిని మంచిదని ఎలా అనగలను?

'ఇంతకంటే అవసరంలేదు' అనేది అందరికీ ఎంత ప్రస్ఫుటంగా ప్రత్యక్షమో, అంత యెండమావుల్లా అగ్రాహ్యంకదా.

—సౌభరి

ట్రే టీపాయ్‌మీద పెడుతూన్న సంధ్యను ముకుందరావుగారు చూచారు. తండ్రి ప్రక్కన సోఫాలో కూచుంటూ సంధ్య ఓమారు తలెత్తి రవికేసి చూసింది. అతను తననే చూస్తూండటం గుర్తించి చూపు మరల్చుకుంది. క్షణంలో సగం సేపు చూసిన సంధ్య చూపులు రవి మనసును ఆకట్టుకున్నాయి.

"పేరేమిటమ్మా" అడిగారు రవి తల్లి కాంతమ్మగారు.

"సంధ్య."

"ఏం చదువుకుంటున్నావ్?"

"బి. ఎస్సీ. ఫైనల్."

"వంటా వార్పూ వచ్చా" అన్న తల్లి ప్రశ్నకు నవ్వుకున్నాడు రవి.

"బాగా రాదండీ" సంధ్య సమాధానం విని పార్వతమ్మగారు కంగారు పడిపోయారు. తనను తాను అణుచుకుంటూ "చదువుకుంటున్న అమ్మాయి కదండీ.... నేనే చెయ్యనివ్వను" అన్నారు.

ముకుందరావుగారు కలుగజేసుకుని "ఆవిడ పాతకాలం మనిషి కదండీ...." అన్నారు నవ్వుతూ.

"మరే.... మీరు ఈ కాలపు మనుషులు...." అన్నారు నవ్వుతూనే కాంతమ్మగారు. అక్కడున్న అందరూ నవ్వారు ఆ సెన్సాఫ్ హ్యూమర్‌కు.

"బాగా చదువుకో అమ్మా. వెళ్ళు లోపలికి" అన్నారు కాంతమ్మగారు సంధ్య వేపు తిరిగి

సంధ్య లేచి లోపలికెళ్ళిపోయింది.

మరో అయిదు నిమిషాలయ్యాక.

"తర్వాత కబురు చేస్తాం శంకరరావుగారూ ..." అంటూ ముకుందరావుగారు లేవటంతో కాంతమ్మగారూ, రవి కూడా లేచి సెలవు తీసుకున్నారు.

గేటుదాకా వెళ్ళి వాళ్ళను సాగనంపి వచ్చారు శంకరంగారు. సోఫాలో కూచుంటూ, భార్యనడిగారు: "కుర్రాడెలా వున్నాడు" అంటూ.

"కుర్రాడికేం..బంగారంలా వున్నాడు. బుద్ధిమంతుడిలా వున్నాడు .... మన పిల్ల అదృష్ట మెలావుందో మరి!" పార్వతమ్మగారి తల్లి మనసులోని మాటలవి.

మళ్ళీ ఆవిడే ప్రశ్నించారు. "ఎంతలో వున్నారట?"

"రిటైర్డు జడ్జి కొడుకుకదూ....ఇంజనీరాయె....వాళ్ళు కట్నం విషయం యెత్తకపోయినా ....పాతికవరకో ముప్ఫయివరకో వుండచ్చు...." ఎటో చూస్తూ సాలోచనగా అన్నారు.

"కుందనపు బొమ్మలాంటి కూతుర్ని పాతిక ముప్పై వేలతోపాటు అతనిచేత పెట్టాలి కాబోలు...." అనుకున్నారు పార్వతమ్మగారు.

"ఈ సంభాషణంతా తన గదిలోంచి సంధ్య వింటూనే వుంది. అంతలేసి కట్నాలిచ్చి తన పెళ్ళి చేయకపోతేనేం! కట్నం తీసుకునే మగాణ్ణి అతను కలెక్టరవనీ, ఇంజనీరవనీ మరెవరేనా అవనీ తాను పెళ్ళిచేసుకోదు ....అది తన సిద్ధాంతానికే వ్యతిరేకం....తన వ్యక్తిత్వానికే తీరని కళంకం. డబ్బుపెట్టి మొగుణ్ని కొనుక్కుంటే తన మనసును....తనను తాను చంపుకున్నట్టే....తన వునికిని వదలుకున్నట్టే....ఆమె మనసు అడిగింది- "మరెవర్ని పెళ్ళిచేసుకుంటావ్?" అని. తనను తనుగా గుర్తించే వ్యక్తిని, తనను భార్యగా గౌరవించే మనిషిని, తననో మనిషిగా ప్రేమించి, ఆదరించే మగాణ్ణి... అంది ఆమె అంతరంగం.

ఆలోచనలమధ్య ఆమె కన్నె మనసు అంది ఓ మూలనుండి 'అతనెంతో బావున్నాడు. ఇంజనీరు. పైగా చాలా మంచివాడిలా అవుపిస్తున్నాడు. కట్నం యిస్తేనేం....?' వెంటనే సంధ్య ఆ కన్నె మనసును కేకలేసింది. 'మగాడె నంత మాత్రాన కట్నం అడగాలా? నేను అంగంగా లేనూ? చదువుకోలేదూ? నేనతన్ని కన్యాశుల్కం అడుగుతున్నానా....? డబ్బు కోసం ఆశపడే మగాణ్ణెందుకు పెళ్ళాడాలి....? నేను స్త్రీననీ, అతని జీవితాన్ని పంచుకునే భాగస్వామిననీ.... తన కష్టసుఖాలను నావిగా భావించుకునే వ్యక్తిననీ అతను భావిస్తే....తన జీవిత సర్వస్వం అతని కర్పిస్తుంది .... లేకుంటే....చస్తే పెళ్ళాడదు....ఆఁ...." అంటూ.

మరో వేపునుండి ఆమె కన్నె వయసు ఆక్రోశించింది. "మగాడు అనబడే ప్రతివాడూ కట్నంకోసం ఆశించే రోజులివి.... కట్నం లేకుండా నిన్నెవరు పెళ్ళి చేసుకుంటారు? కట్నం ఆశించని భర్తే కావాలని నీవు పట్టుదలగా కూచుంటే నీకీ జన్మలో పెళ్ళికాదు....ఇలాగే జీవితాంతం కన్నెగానే నిల్చిపోతావు...."

సంధ్యకు విసుగొచ్చింది. తనలో అశాంతిని రేపుతూన్న ఆ కన్నె మనసు కోరికను గట్టిగా చీవాట్లేసింది: "పెళ్ళవ్వకపోయినా పర్వాలేదు. కట్నం తీసుకునే వాణ్ణి మాత్రం చేసుకోనుగాక చేసుకోను."

ఆ కేకలకూ, ఆ దృఢ నిశ్చయానికీ భయపడిన కన్నెహృదయం భయపడిపోయి నోరు మూసుకుంది.

సంధ్య రికార్డు గీయడంలో నిమగ్నమైపోయింది-

* * *

ఓనాటి సాయంకాలం సంధ్య కాలేజి నుండి యింటికొచ్చేసరికి ముందుహాల్లో మహిళామండలి వుంది. తల్లి సంధ్యను చూడగానే ఎంతో మురిసిపోతూ, "మరేమనుకున్నారు రాంబాయమ్మగారూ.... మా సంధ్య నిజంగా అదృష్టవంతురాలే.... ఎన్నెన్నో సంబంధాలు చూసినా ....వాళ్ళకి అమ్మాయిలు నచ్చలేదుట....మా బంగారు

తల్లి నచ్చిందని కబురు చేశారు....మంచి రోజు చూసుకుని తాంబూలాలు పుచ్చేసు కోవటమే...." అన్నారు.

"కట్నమెంత యిస్తున్నారు వదినా.." పొరుగింటి పుల్లమ్మగారడిగారు.

"కుర్రాడు అందగాడు, పైపెచ్చు ఇంజనీరాయె....పాతికి తక్కువుంద దనుకుంటున్నాం...." పార్వతమ్మగారు గర్వంగా చెబుతున్నారు.

లోనికెడుతూన్న సంధ్య చెవిలో ఆ మాటలు వడనే పడ్డాయి. ఒళ్లు మండి పోయింది. విసురుగా బల్లమీద పుస్తకాలు పడేసి మంచం మీద వాలిపోయింది. మనసంతా చేదు తిన్నట్టయి..... అసహనంగా అటూ యిటూ పొర్లింది. లేచి వంటింట్లో కెళ్ళి రెండు గ్లాసులు నీళ్ళు త్రాగి మళ్ళీ తన గదిలోకి రాబోతూ హాల్లోకి తొంగి చూసింది. తల్లి పెళ్ళి ఎలా చేయాలో, పెళ్ళికి ఎలాంటి బట్టలుకొనాలో యింకా ఏమేమో చెబుతోంది. సంధ్య అసహనంగా, విసురుగా గదిలోకొచ్చింది.

"నేను బొమ్మను కాను.... నా యిష్టానికి వ్యతిరేకంగా పెళ్ళిచేసేందుకు" అనుకుంది మొండిగా.

రాత్రి భోజనాలవేళ శంకరంగారు సంధ్యతో నవ్వుతూ అన్నారు—"సంధ్యా, ముకుందరావుగారు కబురు చేశారమ్మా, వారికి నీవు నచ్చావుట."

సంధ్య చురుగ్గా తలెత్తి తండ్రివేపు చూస్తూ "నాన్నా.... నాకిప్పుడప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదు...." అంది.

ఏనాడూ తండ్రికెదురు మాట్లాడని కూతురు యివాళిలా ప్రవర్తిస్తోంటే పార్వతమ్మగారు ముక్కున వేలేసుకున్నారు.

"అదేం...." నవ్వుతూనే వివరాలడిగినట్టు అన్నారు శంకరంగారు.

"నేను యమ్మెస్సీ చేయాలనుకుంటున్నాను...." అన్నం కెలుకుతూ అంది సంధ్య.

"అయ్యో.... అయ్యో....నీ కేమి చేపిచ్చి.... నిక్షేపంలాంటి సంబంధం.... పోగొట్టుకుంటే మళ్ళీ వస్తుందా....ఆయన రిటైర్డు జడ్జి....అబ్బాయి యింజనీరు.... లక్షల ఆస్తికి వారసుడు.... మంచి సంప్రదాయమైన కుటుంబం...." అంటూ భర్తకేసి తిరిగి "దానిమాటలు పట్టించుకుంటే అయినట్టే....మీరు మంచిరోజు చూసుకుని అన్నీ మాట్లాడి రండి వెళ్ళి" అంటూ భర్తకు ఆర్డరు జారీచేశారావిడ.

సంధ్య కంచంలోచెయ్యికడిగేసుకుంది.

శంకరంగారు నిర్విణ్ణులై పోయి చూస్తూండగానే సంధ్య రయ్యిమంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది.


రంజాన్ పర్వదిన సందర్భమున

VIMAL A RELIANCE PRODUCT

మిల్లువారు అందించు చక్కటి అవకాశం వస్త్ర ఉత్పత్తిలో ఉన్నత ప్రమాణములగల 100% టెక్స్చరైజ్డ్ పాలిస్టరు సూటింగ్స్, షర్టింగ్స్ పలురకాల శారీస్ మరియు డ్రస్ మెటీరియల్స్ ఖరీదుచేసి బిల్లు అమౌంటుపై నిర్ణయించిన సీలు బహుమతులను ఉచితముగా పొందండి.

విమల్ షోరూం, 'ఆరాధన',

కొత్తగూడెం.

ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆపైన ఋణం లభించును.

వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోన్ : 395121

SUPREME CORPORATION (BANKERS)

F-15 "EVEREST" 7th Floor, Near Famous cine laboratory. Tardeo Road, BOMBAY-400 034

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో

చిత్రకళ





స్థాపితం : 1957 ఫోన్ నం 846 188

మీరు మీ ఇంటియందుండే తపాలా పాఠములద్వారా చిత్రకళ నేర్చుకొని రెండు సంవత్సరములలో ఉత్తమ చిత్రకారులు కావచ్చును. యావద్భారత దేశమునుండియు విదేశముల నుండియు అనేకమంది మన విద్యాలయములో విద్యార్థులుగా చేరి ఉత్సాహంతో శిక్షణ పొందుతున్నారు.

మీరు కూడా ఈ సులభపద్ధతులతో చిత్రకళ నభ్యసించుటకు సమ్మతించుచున్నారా? వివరముల కొరకు తొమ్మిది పది పైసల స్టాంపులు పంపండి

SANTHANU'S CHITRA VIDYALAYAM. (J)

179, Singanna Chetty St, Chintadripet, MADRAS-2.

మన్నికకు ప్రసిద్ధిచెందినవి.
అశోకా పెన్స్
& బాల్ పెన్సు
REGD. No. 143646
అశోకా పాళీలు
లాంగ్ లైఫ్ పాయింట్లతో
తయారు చేయబడుచున్నవి.
అశోకాపెన్ వర్క్సు, తెనాలి. (ఆంధ్ర)

దీపా అక్కినేని ఫొటో

మీకు కావాలా? అయితే ఈ క్రింది అడ్రసుకు 4 రూ||లు ఎం. ఓ. చేయండి. వెంటనే "పల్లె జమీందార్" చిత్రంలోని దీప, అక్కినేని వున్న కార్డు సైజు ఫొటోతోపాటు 1980 సినీడైరీ కూడా పంపబడును. డబ్బు కవరులో పెట్టి పంపకూడదు. ఎం. ఓ. ద్వారానే పంపాలి.

వై. కె. మూర్తి.
దాసరివారి వీధి, విజయవాడ-2.

ఉచితము! ఉచితము!

తెల్ల మచ్చలు

అన్నిరకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మం మామూలు రంగు పొందును. ప్రచారం నిమిత్తం ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.

Krishna Chandra Vaidaya (AJ)
P. o Katri Sarai (GAYA) INDI

దీర్ఘవ్యాధులకు ఉత్తమ వైద్యం!



దురభ్యాసములకులోనై దాంపత్యసౌఖ్యంపొందలేనివారు, హెర్నియా, చర్మవ్యాధులకు పోస్టు ద్వారావరిబీజము(బుడ్డ). మూత్రవ్యాధులు, ఇస్నోఫీలియా, దమ్ము, ఉబ్బసమునకు ఆపరేషన్‌లేకుండ రండి.

డా|| దేవర,
5/1, బ్రాడీపేట, గుంటూరు-2
బ్రాంచీలు: 26, నార్త్‌బోగ్‌రోడ్, మద్రాసు-17.
మార్కండేయగుడివద్ద, తెనాలి. ఫోన్: 551

పార్వతమ్మగారు భర్తను మందలించారు. "మీ భోజనం కానివ్వండి..దానికేం తెలుసు.... యీ సమ్మంధం తప్పిపోతే మళ్ళీ యిలాంటి సమ్మంధం దొరకొద్దూ."

భోజనాలయ్యాకశంకరంగారు కూతురు గదిలో కొచ్చారు. "యీ సమ్మంధం గురించి నీ అభిప్రాయం ఏమిటమ్మా" అంటూ ఎలాంటి వుపోద్ఘాతమూ లేకుండా మొదలెట్టారు.

తండ్రి యింత స్ట్రెయిట్‌గా అడుగుతోంటే సంధ్య తికమకపడింది. కొద్దిసేపు మౌనంగా వుండిపోయి. "నా కిప్పుడు చేసుకోవాలనిలేదు", అంది.

"అదే....ఎందుకూ అనడుగుతున్నా."

"నా కిష్టంలేదు."

"పెళ్ళా.... ఆ కుర్రాడా...." పార్వతమ్మగారు వచ్చి భర్తదగ్గర కూచుంటూ అడిగారు.

సంధ్య విసుగ్గా మొహం పెట్టింది.

"చెప్పమ్మా...." శంకరంగారి గొంతుకలో ఆప్యాయత పొంగిపొరింది. తండ్రి అలా అభిమానంగా అడిగేసరికి సంధ్య చప్పున చెప్పేసింది. "కట్నం తీసుకునే వ్యక్తిని నేను పెళ్ళాడలేను నాన్నా...."

శంకరంగారు గలగలా నవ్వారు. పార్వతమ్మగారు కళ్ళు మరింత పెద్దవిగాచేసి కూతుర్ని చూడసాగారు.

"చూడమ్మా సంధ్యా.... నీవింకా పసిదానివి. నీకీ ప్రపంచపు పోకడ తెలీదు. డబ్బు లేందే ఏ పనీ సాగదమ్మా.... అయినా మనం కట్నం యిచ్చుకోలేని స్థితిలో లేముగా! నీకెందుకమ్మా ఆ గొడవలన్నీ. నీ సుఖం కోసం ఏం చేయాలో మాకు తెలుసమ్మా. పిచ్చి పిచ్చిగా ఆలోచించి మనసు పాడుచేసుకోకు...." అనేసి లేచి వెళ్ళిపోయారు గదిలోంచి.

పార్వతమ్మ కూతుర్ని ఆశ్చర్యంగా చూస్తూండిపోయింది.

ఆ రాత్రంతా ఆలోచించిన సంధ్య ఓ నిర్ణయానికి వచ్చి తేలిగ్గా గాలి పీల్చుకుంది. తన ఆలోచన అమలుపరచే అవకాశంకోసం యెదురు చూడాలని నిర్ణయించుకుంది.

ఓ నాటి మధ్యాహ్నం స్నేహితురాలింటినుండి నడచి వస్తోన్న సంధ్య తన ప్రక్కనో స్కూటరు వచ్చి ఆగటంగానీ, స్కూటరు మీద రవీంద్ర కూచుని వుండటం గానీ గమనించలేదు.

తల వంచుకుని తన ధ్యాసలో తాను ముందుకెడుతున్న సంధ్యను చూసి నవ్వుకున్నాడు రవి. మృదువుగా "సంధ్యారాణి గారూ" అని పిలిచాడు.

ఆ పిలుపు సంధ్య ఆలోచనలకూ కాళ్ళకూ బ్రేక్ వేసింది. చటుక్కున తలెత్తి అటువైపు చూసిన సంధ్య, రవి అగుపించగానే గతుక్కుమంది. కానీ మరు నిమిషంలో తాను అమలుపరచాలన్న పథకాన్ని అమలుపరచేందుకు లభించిన ఆ అదనును పోగొట్టుకోకూడదని గట్టిగా నిర్ణయించుకుంది.

"బావున్నారా?" చిరునవ్వు పెదాలమీద నర్తించగా అడిగాడు రవి.

'బావున్నాన'న్నట్టు తలూపింది.

రవి స్కూటరు దిగి నాలుగడుగులు ఆమెతోపాటు వేశాడు- స్కూటరును నడిపిస్తూ.

"మీ రగుపిస్తారేమోనని...." రవి మాటలు పూర్తికాకుండానే సంధ్య అందుకుంది: "ఎదురు చూశారా?"

"మరే...." ఎంతో ఆనందంతో అతని ముఖం వెలిగిపోతోంటే సంధ్యకు వళ్ళు మండిపోతోంది. 'ఎదురు చూసున్నావ్టా... ఎదురు.... యిప్పుడు చెపుతాను పాఠం నీకు....' అనుకుంది కసిగా మనసులోనే.

మరో పదడుగులు వేసి 'హోటల్ సవేరా' ముందు స్కూటరుకు స్టాండు వేస్తూ.. "రండి.. కాఫీ పుచ్చుకుందాం.." అన్నాడు రవి.

సంధ్య అతని వేపు చూడకుండానే అతన్ని అనుసరించింది.

ఫామిలీ రూంలోకి దారితీశాడు రవి.

టేబిలుకు అటొకరూ యిటొకరూ కూచున్నారు. మౌనంగా చేతిలోని పుస్తకాలవేపు చూస్తూ కూచున్న సంధ్యను తదేకంగా చూస్తూ కూచున్న రవి వుండలేక అడిగేశాడు. "మీకు మాటలు రావా?"

తన మనసులోని భావాన్నెలా బహిర్గత పరచాలా అని ఆలోచిస్తోన్న సంధ్య అతనికి జవాబు చెప్పలేదు.

అక్కడకు వచ్చిన బేరర్‌ను చూసి. సంధ్య నుద్దేశించి "ఏం తీసుకుంటారు. సంధ్యారాణి గారూ?" అనడిగాడు రవి.

సంధ్య తన ఆలోచనల్లోంచి బయటపడి, "ఏం వద్దు" అంది. రవి నవ్వేసి బేరర్ వేపు తిరిగి, "రెండు బాసుంది.... రెండు మిక్స్చర్.. రెండు కూల్‌డ్రింక్స్" అన్నాడు.

"సంధ్యారాణిగారూ.. మా నాన్నగారికి మీ గురించి నా అభిప్రాయం చెప్పాను.... మరి నేను.... మీ అభిప్రాయం తెలుసుకోవచ్చా...." మృదువుగా అడుగుతోన్న అతని కంఠస్వరం, సంధ్య మనస్సును నెమలిలా నాట్యం చేయించింది, కానీ తనను తాను సంబాళించుకుంటూ నెమ్మదిగా అంది. "నా కిప్పుడే పెళ్ళి చేసుకోవాలని

లేదు.... యమ్మెస్సీ చదవాలనుకుంటున్నాను." రవి అధరాలమీద చిన్న చిర్నవ్వు నర్తించింది. "పెళ్ళయ్యాక మీరు చదువుకుంటానంటే నా కభ్యంతరం లేదు.. నేను తెలుసుకోవాలనుకుంది, మీకు నేను నచ్చానా లేదా అని....అంతే."

"పెళ్ళి చేసుకోవాలని లేనప్పుడు నచ్చటమూ, నచ్చకపోవటమూ అంటూ ఏముంది?" చురుగ్గా తగిలించా ననుకుంది సంధ్య.

"కారణం తెలుసుకోవచ్చా?" మాటలు మృదువుగా నేవున్నా అతని ముఖం గంభీరమవటం సంధ్య గమనించక పోలేదు. "పెళ్ళిచేసుకుంటే పాతికవేలదాకా కట్నం వస్తుందికదూ పాపం...." కసిగా అనుకుంది. అతని ప్రశ్నకు సమాధానం కాక తాను మరో ప్రశ్న వేసింది. "కట్నాల గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

రవి ఓ అరక్షణం మౌనంగా వుండిపోయి. గంభీరంగా అన్నాడు తర్వాత. "కట్నం యివ్వటంలో తప్పులేదు. తీసుకోవటంలోనూ తప్పులేదు.... ఇవ్వగలిగిన వాళ్ళదగ్గర. వాళ్లు యిస్తామన్నపుడు తీసుకోవటంలో అసంబద్ధమయింది ఏముంది? యివ్వలేనివారినుండి, వారిని పీడించి రాబట్టుకోవటం తప్పుగాని...." అతని మాటల్ని పూర్తికానివ్వలేదు సంధ్య "యింతింత చదువులు చదువుకున్న మీలాంటి వారు కూడా యీ దురాచారాలను సమర్థిస్తోంటే...." రవి నవ్వేశాడు: "నేను సమర్థించటంలేదు.... లోకంలో జరుగుతోంది. చెప్పానంతే...."

సంధ్యకు వళ్ళుమండింది. ఇలా డొంక తిరుగుడుగా కాక సూటిగా అడగాలనుకుంది. "మీ కెంత కావాలి కట్నం" ఎంత అదిమిపెట్టినా ఆమెలోని కసి. అహం. ఆవేశం బైటికి వస్తూనేవున్నాయి.

"నాకా.... చాలానే కావాలి." రవి కళ్ళల్లోని వెలుగు ఎందుకో సంధ్యకు అర్థమవలేదు. అతన్ని చూస్తోంటే చుర్రుమంటోంది మనసులో.

"ఎంత కావాలి?" ఎకసక్కెంగా అడిగింది " రవి చిద్విలాసంగా నవ్వాడు.

"మీ రివ్వగలిగినంత...."

"ఇవ్వకపోతే...." సంధ్యకు చర్రున మండుకొస్తోంది- రవి నవ్వునూ, మాటల తీరునూ, ముఖ భంగిమలనూ చూస్తోంటే.

ఓ క్షణం తన నవ్వు నాపి సీరియస్‌గా ముఖంపెట్టి "కట్నం అడిగామా మేము?" అన్నాడు.

"ఆఁ...." సంధ్య చప్పున అనేసింది.

"మీరు పొరపాటు పడుతున్నారు.. మాకు మీ నుండి కట్నం గుంజాలన్న ఐడియా కూడా లేదు.. నిజం.. ఐ హేట్ డౌరీ సిస్టం.... మాకు కావలసినంత ఆస్తి వుంది. మరొకరి నుంచి కట్నం రూపంలో కానీ, మరే రూపంలోగానీ డబ్బు పుచ్చుకోవటం అసహ్యం .... నాకు కొన్ని స్థిరమైన సిద్ధాంతాలున్నాయి.... వాటికి వ్యతిరేకంగా ఏపరిస్థితుల్లోనూ నడవలేను....నడవను.... మా వాళ్ళు నాకు నచ్చని పనులు ఏవీ చెయ్యరు.... నాకు కావలసింది.... నాకు నచ్చిన అమ్మాయి.... నన్ను ప్రేమించగల అమ్మాయి.... అంతే. డబ్బురూపేణా ఏర్పడే సంబంధాలను నేను భరించలేను .... కట్నం మా వాళ్ళు పుచ్చుకున్నా, మీ వాళ్ళు యిచ్చినా నేను సహించను........మరొక విషయం- పెళ్ళిపేరట అనవసరమైన ఖర్చులను నేను అంగీకరించను.... మీకు నేను నచ్చితే.... యిందులో బలవంతం ఏమీ లేదు....మన పెళ్ళి చాలా నిరాడంబరంగా జరగాలి...." గంభీరంగా సాగిపోతోన్న అతని వాగ్ధాటి చప్పున ఆగిపోయింది.


సంధ్య హృదయంలో పన్నీటిజల్లు కురిసినట్టయింది. నల్లని మబ్బుల్లోంచి జారిన మెరుపుల్లాగా సంధ్య కనురెప్పలనుంచి జారిన ఆమె చూపులు రవి కళ్ళకు మిరిమిట్లు గొలిపాయి. ఆమె అధరాలమీద మెచ్చుకోలుగా గులాబిరేకులు విచ్చుకుంటూంటే.... మధురమైన మందహాసం మంజులంగా వెలిగింది. ఆమె బుగ్గలమీది మందారాలను చూస్తూ పారవశ్యంతో తడిసిపోయాడతను సర్వం మరిచి.

బేరర్ రావటంతో యిద్దరూ యిలలోనికొచ్చిపడ్డారు. బేరర్ ప్లేట్సన్నీ బల్లమీదుంచి బయట కెళ్ళిపోయాడు- కూల్ డ్రింక్స్ తెచ్చేందుకు.

"మరి....మీ అభిప్రాయం...." రవి హృదయం ఆరాటపడిపోతూ అడిగింది. కనుపాపల నిండుగా అతని రూపాన్ని నింపుకుందా మన్నట్టు నల్లని కెరటాల్లాంటి కనురెప్పల నెత్తింది. ఆ చూపుల్లో "నా హృదయం నా చూపులలో వ్యక్తం కాలేదా?" అన్న ప్రశ్న వుంది.

రవి కళ్ళకు ఏదో భావం....ఏదో అర్థం ఆమె చూపుల్లో స్ఫురించినట్టయి తళతళలాడాయి.

ఆపుకోలేని ఆనంద పారవశ్యంతో ఆమె సుతిమెత్తని చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు. సంధ్య వదనం సంధ్యముసిరిన ప్రకృతిలా యెర్రబడింది.




## చవట సంతకం

ఒక మంత్రిగారికి టపాలో ఓ రోజు ఓ ఉత్తరం వచ్చింది. కవరు చించితే అందులో ఒకే ఒక తెల్ల కాగితం వుంది. దానిమీద "చవట" అని రాసుంది.

ఇది ప్రతిపక్షంవాళ్ళ పనయి వుంటుందని భావిస్తూ వాక్చాతుర్యుడైన ఆ మంత్రి, ఆ మర్నాడు సభలో- నాకు ఉత్తరం రాసి సంతకం పెట్టడం మర్చిపోయే వారు కొందరు, యిప్పుడో ఆసామీ సంతకం చేసి ఉత్తరం రాయడం మర్చిపోయాడని చమత్కరించాడు.

★

## సస్పెన్స్

"మీ స్వవిషయాల్లో వేలుపెట్టడం నా కిష్టం లేదు, కాని ఒక విషయం రోజుల తరబడి నన్ను తినేస్తోందండీ" అంది ఓ సరస్వతి ఓ సుబ్బారావుతో.

"అయితే ఆ సంగతేదో చెప్పుదేవీ!" అన్నాడతను.

"ప్రకితం శుక్రవారం మీకో ఉత్తరం వచ్చింది. గులాబీ రంగు కాయితంమీద దస్తూరీ ఆడదస్తూరీలానే వుంది. పసుపు రంగు కవర్లో సెంటు పూసుకుని ఘుమఘుమలాడుతూ వచ్చిందవునా?"

"అవునూ"

"అప్పుడు మీరేమో ఆ కవర్ని తెరుస్తూండగా ముచ్చెమటలు పోశాయి. ముఖం తెలతెలా పాలిపోయింది. మరేమో మీ చేతివ్రేళ్ళు వణికాయి. దేవుడిమీద ఒట్టేసి అదెవర్తో, ఎక్కడ్నుంచి, ఏవిటి రాసిందో చెప్పండి నాకిప్పుడు."

"ఓ అదా! అప్పుడు మనిద్దరిమధ్యా ఆ విషయం లేకపోవడమే ఓ విధంగా మంచిదనుకున్నాను. అయితే ఈ విషయం అగ్నిపర్వతం బద్దలయినట్లు కాకుండా నీతో ఎలా కదిపితే బావుంటుందా అని ఆలోచిస్తున్నాను."

"ఎందుకీ మాయ మాటలు. చెప్పేదేదో చెప్పేసెయ్యండి." అని వుండబటలేక అరిచిందా సరస్వతి.

"సరే—ఆ ఉత్తరం చీర్లకొట్టునుంచి. నీ పేర ఖాతాలో 1200 బాకీ వుందిట."